

ఇందిరా పార్కు వద్ద జరిగిన ధర్నాలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, యూనియన్ కార్మికులు

వారిపై వెంటనే విచారణ చేపట్టాలి

కవాడిగూడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సినిమా పరిశ్రమ కాస్ట్యూమ్స్ కార్మికులను మోసం చేసిన యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు, కోశాధికారులపై వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని తెలుగు సినీ అండ్ టీవీ కాస్ట్యూమ్స్ వర్కర్స్ యూనియన్ హౌసింగ్ గ్రూప్ సభ్యులు కోరుతున్నారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం వెంకటేష్ మాట్లాడారు. తెలుగు సినిమా కాస్ట్యూమ్స్ కార్మికులను మోసం చేసిన అధ్యక్షుడు వాసు , కార్యదర్శి నరసింహారావు , కోశాధికారి రాంబాబులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 20 ఎకరాలు కొంటున్నామని చెప్పి వివిధ సాకులు చెబుతూ చివరికీ ఐదు ఎకరాలు మాత్రమే చూపిస్తున్నారని తెలిపారు. సీఐటీయూ నగర అధ్యక్షుడు జయకుమార స్వామి, నగర ఉపాధ్యక్షులు వి కామేష్‌బాబు. కాస్ట్యూమ్స్ యూనియన్ వర్కర్స్ నాయకులు ఎస్‌కె బాబ్జి రమేష్; సాంబశివరావురాజు. జూనియర్‌ఆర్టిస్ట్ యూనియన్ ప్రధానకార్యదర్శి రమవేణి పాల్గొన్నారు.



ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీశ్రీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐడీవైఓ నేతలు

శ్రీశ్రీ రచనలు నేటి సమాజానికి అవసరం

కవాడిగూడ, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీశ్రీరచనలు ఆయన ఆలోచనలు నేటి సమాజానికి ఎంత అవసరమని ఆలిండియా డెమొక్రటిక్ యూత్ ఆర్గనైజేషన్ (ఏఐడీవైఓ) నేతలు అన్నారు. ఆయన 42వ వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్యాంక్‌బండ్‌పై ఉన్న శ్రీశ్రీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. శ్రీ శ్రీ అనే రెండు అక్షరాల పేరుతో తెలుగుసాహిత్య జగత్తును ఊగించి శాసంచి ఒక నవ్యశకానికి నాందిపలికారని రాష్ట్ర కన్వీనర్ తేజ అన్నారు. ఆయన రచించిన కావ్యాలు రచనలు చదివిన వారిని ఉర్రూతలూగించాలని పేర్కొన్నారు. ఆయన సాహిత్యాన్ని భావాలను జీవితాన్ని తెలుసుకోవాలని చెప్పారు. కో-కన్వీనర్ కామ్రేడ్ నాగరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో ఏఐడీవైఓ సభ్యులు కామ్రెడ్ గంగాజి, శ్రీనివాస్, జాని, దేవరాజ్, నవనీత్ తదితర యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భారీ ర్యాలీ నిర్వహించారు.



మాట్లాడుతున్న ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

బీఆర్ఎస్ మరింత బలోపేతానికి కృషి

● **పార్టీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి**

ముషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త అంకిత భావంతో పనిచేయాలని బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని భరత్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో డివిజన్ బీఆర్ఎస్ బూత్ స్థాయి కార్యకర్తలతో కలిసి ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్‌కు చేరువయ్యేలా కృషిచేస్తామన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి, రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆకుల అరుణ్ కుమార్, వాణిజ్య విభాగం అధ్యక్షుడు టెంట్ హౌస్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు శివముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, డివిజన్ ఇన్‌చార్జి శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షులు బల్లా ప్రశాంత్, శ్రీధర్, డివిజన్ నాయకులు జావిద్‌ఖాన్, శ్రీశైలం యాదవ్, క్రాంతి, కొండా సహదేవ్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ-1 పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరా ఉండదని సీబీడీఏడీఈ వినోద్‌కుమార్ తెలిపారు. కార్మిక కమిషనరేట్ అంజయ్యభవన్, కపాడియా, ఉర్దూ హాల్ 11కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1, వివేక్‌నగర్, క్షత్రియ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): సేవా కార్యక్రమాలతో మానసిక సంతృప్తి లభిస్తోందని నిమ్స్ డైరెక్టర్ బీరప్ప, సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో సేవా కార్యక్రమాలు పెద్దఎత్తున నిర్వహిస్తున్న షైనంపల్లి ట్రస్ట్ చైర్మన్ బద్దం మోహన్‌రెడ్డి అభినందనసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డిని సన్మానించారు. షైనంపల్లి ట్రస్ట్ పక్షాన రక్తదాన శిబిరాలు, పేదలకు అన్నదానాలు నిర్వహిస్తూ తన వంతుగా సమాజానికి సేవలు చేయడం స్ఫూర్తిదాయకమని బీరప్ప, సత్యనారాయణ అన్నారు.

ట్రస్మా ముషీరాబాద్ మండల కమిటీ ఎన్నిక

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ట్రస్మా ముషీరాబాద్ మండల కమిటీని ఎన్నుకున్నారు. చిక్కడపల్లిలో ఆదివారం జరిగిన ట్రస్మా సమావేశంలో అధ్యక్షుడిగా ఎన్. సందీప్‌కుమార్ గుప్తా, ప్రధానకార్యదర్శిగా పి. మహేష్, కోశాధికారిగా ఆర్. రాజేశ్వరిలను ఎన్నుకున్నట్లు ట్రస్మా తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరిశేఖర్‌రావు, కోశాధికారి జైసింహగౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి శివరామకృష్ణ, వర్కింగ్ అధ్యక్షుడు ఆర్‌వీఎల్ఎన్ ప్రసాద్‌లు తెలిపారు.



నూతన కమిటీ సభ్యులతో రాష్ట్ర, జిల్లా సభ్యులు

ద్వానా శాస్త్రి సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): ద్వానా శాస్త్రి భాషా సేవ చిరస్మరణీయమని ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కేవీ రమణాచారి అన్నారు. ఆయన చేసిన రచనలు తెలుగు భాషను సుసంపన్నం చేశాయని పేర్కొన్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ రచయిత, సాహిత్య సవ్యసాచి డా. ద్వానా శాస్త్రి 78వ జయంతి సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త డా. వోలేటి పార్వతీశంకు కిన్నెర ద్వానా శాస్త్రి స్మారక పురస్కార ప్రదానం జరిగింది. ద్వానా శాస్త్రి సివిల్ సర్వీస్ పరీక్షలకు హాజరు అయ్యే వారికి బోధకుడిగా, తెలుగు సాహిత్యంపై అవగాహన కలిగించే కాలమిస్ట్‌గా చేసిన భాషా సేవ గొప్పదన్నారు. సునిశిత పరిశీలన, నిరంతర అధ్యయనంతో ద్వానా శాస్త్రి తెలుగు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందారని చెప్పారు.



వోలేటి పార్వతీశంకు పురస్కారం బహూకరించి సత్కరిస్తున్న అతిథులు

● **శిక్షణ ముగిసే.. విద్యార్థులు మురిసే..**

వేసవి సెలవులు సద్వినియోగం చేసుకునేందుకు నెలరోజులపాటు నిర్వహించిన థియేటర్ వర్క్ షాప్ ఆదివారంతో ముగిసింది. ఆర్యన్ ఆర్ట్స్ అకాడమీ, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తన చేతుల మీదుగా అవార్డులను ప్రదానం చేశారు. అభినయ శైలి, పాత్ర అవగాహన, సెట్ డిజైన్, కాస్ట్యూమ్ డిజైన్ తదితర అంశాలలో విద్యార్థులకు సమగ్రమైన శిక్షణ పొందారని ఆర్యన్ ఆర్ట్స్ అకాడకమీ వ్యవస్థాపకుడు సరోజ్‌బాలాఠాకూర్ తెలిపారు. **కవాడిగూడ, (ఆంధ్రజ్యోతి)**



వర్క్‌షాప్‌లో విద్యార్థులు

గత పాలకుల వల్లే
విద్యా వ్యవస్థ నిర్వీర్యం

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : గత పాలకుల వల్లే విద్యా వ్యవస్థ నిర్వీర్యమైందని పలువురు వక్తలు ఆరోపించారు. తెలంగాణ విద్యారంగంపై ఆంధ్ర దోపిడీదారుల విధానాన్ని అరికట్టి రాష్ట్రంలో విద్యారంగాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైన ఉందన్నారు. రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు పూర్తయినా తెలంగాణలో ఆంధ్ర దోపిడీదారుల విద్యాదోపిడీ ఇంకా కొనసాగుతోందని ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో తెలంగాణ విద్యారంగం - ఆంధ్రా దోపిడీ అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్ సమన్వయకర్తగా జరిగిన సమావేశంలో ప్రముఖ కవి డాక్టర్ సుంకిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తమ్, ప్రముఖ విద్యావేత్త ఆర్.వెంకటరెడ్డి, ఏఐఎఫ్ మాజీ జాతీయ నాయకుడు స్టాలిన్, ఏఐఎఫ్ఎఫ్ రాష్ట్ర నాయకుడు గ్యార నరేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు తాళ్ల అజయ్, చరిత్ర పరిశోధకులు డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ తదితరులు హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రైవేట్ విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు పల్లె వినయ్‌కుమార్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇటిక్యాల పురుషోత్తమ్

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

● **ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

గోల్నాక, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు లక్ష్యాలు పెట్టుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. ఆదివారం గోల్నాక డివిజన్ సుందర్‌నగర్‌లోని భావసార్ భవన్‌లో భావసార క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 49వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు మెరిట్ మార్కులు సాధించిన 400 మంది పేద విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగులతో పాటు స్టేషనరీ వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వెంకటేష్ హాజరై అందజేశారు. విద్యార్థులు మహోన్నత శిఖరాలకు ఎదగాలంటే క్రమశిక్షణతోపాటు పట్టుదలతో చదువుకోవాలన్నారు. చదువులోనే కాకుండా ఇతర రంగాలపై దృష్టిసారించాలన్నారు. భావసార్ క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ యేటా వందలాదిమంది విద్యార్థులకు చేయూతనిస్తూ అందజేస్తున్న సహాయసహకారాలు ఎంతో ప్రశంసనీయమైనవని కొనియాడారు. కార్యక్రమంలో ఉమేష్ జిటానే, అమర్నాథ్, అశ్విన్‌పటాంగే, కృష్ణతండ్లే, మధూసూదన్, సత్యనారాయణ, రాజేశ్వర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేష్ చిత్రంలో అసోసియేషన్ ప్రతినిధులు అశ్విన్, ఉమేష్, అమర్నాథ్ తదితరులు

దరఖాస్తు గడువును
30 వరకు పొడిగించాలి

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సహాయ పరికరాలు పొందడానికి చేసే దరఖాస్తు గడువును ఈనెల 30వరకు పొడిగించాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె. వెంకట్, ఎం. అడివయ్యలు డిమాండ్ చేశారు. వీటి విషయంలో షరతులు పెట్టి వాటిని అందకుండా చేసే కుట్రలను అధికారులు విరమించుకోవాలన్నారు. గడువును పొడిగించకుంటే ఈనెల 17న దివ్యాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. టెండర్స్ వేసిన పరికరాలను అన్నింటిని లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 7నుంచి 17వరకు దరఖాస్తు చేసుకోవాలని విధించిన నిబంధన సరికాదని ఈనెలాఖరు వరకు గడువు ఇవ్వాలని ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లో కూడా వాటిని తీసుకోవాలని వారు కోరారు.



మాట్లాడుతున్న డా.ఎస్‌పి భారతి తదితరులు

బాలనాట్య కళాకారులను ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బాలనాట్య కళాకారులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధించగలరని ప్రముఖ కూచిపూడి నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్‌పి భారతి అన్నారు. సిద్ధ నాట్య కళాసమితి ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలో కూచిపూడి నృత్యప్రదర్శనలు జరిగాయి. అనంతరం బాలకళాకారులను ఆమె అభినందించి మాట్లాడారు. కూచిపూడి నాట్యకళకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు వచ్చిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు నాట్యంలో శిక్షణ పొందడంవల్ల వారిలో క్రమశిక్షణ, అంకితభావం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాట్యగురువు వాణీరమణ, వాన గోపీనాథ్, వై. మల్లేశ్వర్‌రావు, సుధామాల తదితరులు పాల్గొన్నారు.



భట్టిని సన్మానిస్తున్న గౌడ, కల్లు గీత సంఘాల నేతలు

డిప్యూటీ సీఎం భట్టికి సత్కారం

రాంనగర్, జూన్ 15(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క జన్మదినం సందర్భంగా పలువురు నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను సన్మానించారు. తెలంగాణ గౌడ కల్లు గీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్, బీసీ కుల సంఘాల జేఏసీ కన్వీనర్ బాలగౌని బాల్‌రాజ్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దుర్గయ్యగౌడ్, టీపీసీసీ మాజీ అధికార ప్రతినిధి బి.వెంకటేష్‌గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నాగేష్‌గౌడ్‌లు ఆయనను కలిసి వారిలో ఉన్నారు.

చిక్కడపల్లి : నిరుద్యోగుల కలలను కాంగ్రెస్ ప్రభుత్వం సాకారం చేయాలని చిక్కడపల్లి సిటిసెంట్రల్ లైబ్రరీ నిరుద్యోగుల సంఘం అధ్యక్షుడు దూదేకుల సలీమ్ అన్నారు. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఆదివారం ఆయన నివాసంలో నిరుద్యోగులు, శ్రీనివాస్ తదితరులతో వెళ్లి ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. భట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

● ఎంబీసీ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ జరిపేటి జైపాల్ ఆధ్వర్యంలో ఆదివారం వడ్డెరసంఘం తెలంగాణ లక్ష్యసాధన రాష్ట్ర చైర్మన్ జరిపేటి సత్యనారాయణరాజు, వడ్డెర సంఘం తెలంగాణ(గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య, వడ్డెరసంఘం ముఖ్యసలహాదారుడు డా. ఓర్సు కృష్ణయ్యలు ఉపముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం నాయకులు చంద్రయ్య, వెంటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

● **మాజీ మంత్రి కృష్ణాయాదవ్**

రాంనగర్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను బీజేపీ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్ పిలుపునిచ్చారు. అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ అధ్యక్షతన ఆదివారం వడ్డెరబస్తీలో వికసిత్ భారత్ సంకల్ప సభ జరిగింది. అడిక్‌మెట్ డివిజన్‌లో బీజేపీ బలోపేతం కావాలని, ఆపై జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జెండా ఎగురవేయాలని సూచించారు.

నల్లకుంట : తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోదీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి తీసుకువచ్చేలా పార్టీశ్రేణులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ 11 ఏళ్ల పాలనలో భాగంగా బీజేపీ వికసిత్ భారత్ కార్యక్రమం బాగ్‌అంబర్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు నాగరాజుచారి ఆధ్వర్యంలో జరిగింది.



నల్లకుంట: మాట్లాడుతున్న మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్

బర్కత్‌పుర: వికసిత్ భారత్ నిర్మాణమే ప్రధాని మోదీ లక్ష్యం అని మాజీమంత్రి సికృష్ణాయాదవ్ అన్నారు. 2047 వరకు వికసిత్ భారత్ నిర్మించడం ద్వారా ఇండియా ప్రపంచాన్ని పూర్తిగా శాసించే స్థాయికి ఎదుగుతుందన్నారు. ఆదివారం కాచిగూడ డివిజన్ బర్కత్‌పుర కాసీరామ్‌జీరా, ఇందిరానగర్ బస్తీలలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి అధ్యక్షతన వికసిత్ భారత్ సంకల్ప సభలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఆప్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్రా రాముగౌడ్, పార్టీ నేతలు

ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీ

● **ఆప్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బుర్రా రాముగౌడ్ డిమాండ్**

కవాడిగూడ , జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను మెరుగుపర్చి అన్ని సౌకార్యాలు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలల్లో పెరిగిన ఫీజుల నియంత్రణకు ప్రత్యేక కమిటీ వేసి చట్టాన్ని తీసుకు రావాలని తెలంగాణ రాష్ట్ర ఆమ్ ఆద్మీ పార్టీ మాజీ అధ్యక్షుడు బుర్రా రాముగౌడ్ ప్రభుతాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం దోమలగూడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో అధికారంలోకి రాక ముందు కాంగ్రెస్ విద్యార్థులకు ఐదు లక్షల విద్యా భరోసా కార్డు అందజేస్తామని హామీనిచ్చి నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. ఉన్నత విద్య చదువుతున్న బాలికలకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటర్‌లు ఇస్తామన్న వాగ్దానం సైతం ప్రకటనగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలు మెరుగుపరిచేవిధంగా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిలో భాగంగా తెలంగాణ ఆప్ ఆధ్వర్యంలో విద్యా ఉద్యమ చరణను మూడు దశలుగా ప్రారంభించామన్నారు. 16న అంబేడ్కర్ విగ్రహాల వద్ద ప్లకార్డులతో నిరసన, వినతులు, 18న డీఈఓలకు సైతం వినతి పత్రాలు అందజేస్తామన్నారు. 19న డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయాల వద్ద పేరెంట్స్ అసోసియేషన్‌లతో కలిసి తాము నిరసనలకు పిలుపునిచ్చామని తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఆప్ నేతలు సీనియర్ నాయకులు హనుమంతరావు, రహమాన్ షరీఫ్, శివాజీ, బాబులాల్ పవర్‌లు పాల్గొన్నారు.



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాకేశ్

అందరూ సమష్టిగా పని చేయాలి

చిక్కడపల్లి, జూన్ 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు మరింతగా కృషి చేయాలని ముషీరాబాద్ శాసనసభ్యుడు ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న పార్టీ గాంధీనగర్ డివిజన్ ప్రధానకార్యదర్శి పోతుల శ్రీకాంత్‌ను ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గోపాల్ సన్మానించారు. బీఆర్ఎస్ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముఠారపు రాకేష్‌కుమార్, నాయకులు పున్న సత్యనారాయణ, బత్తుల కిరణ్, ఆకుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా శివకుమార్



ముషీరాబాద్, జూన్ 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మహాత్మానగర్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకులు ఎర్రబోయిన శివకుమార్ నియమితులయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్ విశ్వం, బిజ్జి కనకేష్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. భోలక్‌పూర్‌లో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు.

రేపు సీపీఐ (ఎంఎల్) మహాధర్నా

నల్లకుంట, జూన్ 15 (ఆంధ్రజ్యోతి) : ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆదివాసీ హననాన్ని ఆపాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్‌తో ఈనెల 17న ఇందిరా పార్కు ధర్నా చౌరస్తా వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నట్లు సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ నేతలు వెల్లడించారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో మహాధర్నా వాల్‌పోస్టర్‌ను పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.గోవర్ధన్, ఐఎఫ్‌టీయూ జాతీయ నాయకుడు బి.ప్రదీప్, పీవోడబ్ల్యూ జాతీయ నాయకురాలు వి.సంధ్య ఆవిష్కరించి మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో ఇప్పటివరకు 600 మందిని ఆదివాసీలను పొట్టనబెట్టుకున్నారని ధ్వజమెత్తారు.